

'వెలుగు'లో వృద్ధులు, చిన్నారులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని అమ్మచెరువు మిట్టలోని వెలుగు సంస్థలో కర్ణాటక హైకోర్టు రిజిస్టార్ బాగేపల్లి వెంకటరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి బి.సుజాతమ్మ కుమారులు వెంకటప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సతీష్ కుమార్, కోడళ్లు చరిత సోనీ, డాక్టర్ అరవిందరెడ్డి వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడ వెలుగు సంస్థలోని చిన్నారులకు, వృద్ధులకు కర్ణాటక హైకోర్టు రిజిస్టార్ బాగేపల్లి వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాగేపల్లి వెంకటరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, మన వెలుగు సంస్థలోని చిన్నారులకు, వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసిన వారి కుటుంబ సభ్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి,సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటీ, సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్‌కు జీవితాంతం మెయిన్ వర్కర్‌గా సూపెర్వైజర్‌గా ఎటువంటి ప్రమోషన్ లేకుండా హెల్పర్, వర్కర్ రెండు రకాల పనులను చేయిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ పనులతో కలిపి తీవ్ర పనిబారం ఉంటుందని రిటైర్ అయ్యేవరకు ప్రమోషన్ ఉండదనిపేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో సెలవు పెట్టాలంటే సెంటర్ మూతపడుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా హెల్పర్ ఉంటే మూత పడాల్సిన అవసరం లేదన్నారు. మెయిన్ సెంటర్‌లుగా మార్చి లబ్ధిదారులకు హెల్పర్ ను అందుబాటులో తెస్తే లబ్ధిదారులకు ఏ సమయంలోనైనా సేవలందించవచ్చన్నారు. వర్కర్‌కు పనిభారం తగ్గడం అదనపు హెల్పర్‌కు ఉపాధి అవకాశం ఇచ్చినట్టవుతుందదని తెలిపారు. జిల్లాలో ఉన్న లక్షల జనాభాకు తగ్గ సెంటర్లు లేవన్నారు. ఫలితంగా పేద ప్రజలకు మరింత సేవాలిందియ్యాలంటే మరి కొన్ని సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులు కొత్త సెంటర్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పిశ్రీనివాసులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శి ఎస్.ఓబుళమ్మ డి.విజయమ్మ, ఉమా, శభానా లక్ష్మిదేవి, మినీ వర్కర్లు కె.వనజ, యల్లమ్మ, పావని, రేణుక, విజయ, మంజుల, శ్రావణి,, అన్నపూర్ణ, పుష్ప, రాధ, రేణుక,ప్రమీల, అంజనమ్మ పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



మోక్షగుండంకు నివాళి అర్పిస్తున్న కళాశాల బృందం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇంజినీర్లు మన జాతి భవిష్యత్తును బలంగా నిర్మించే శక్తిగల వారని అన్నమాచార్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ అన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీలో ఆదివారం జాతీయ ఇంజినీర్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ఇంజినీర్ల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఎన్నో సాగు నీటి ప్రాజెక్టులకు ప్లానింగులు ఇచ్చి వాటి నిర్మాణంలో ఆయన పాత్ర అమోఘమైందని పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య దేశానికి ఎనలేని సేవలతో పాటు మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చారన్నారు. ప్రభుత్వం ధనాన్ని ఒక్క రూపాయి కూడా వృధా ఖర్చు లేకుండా ఎంత వరకు అవసరమో అంతమేరా ఖర్చు చేసి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను నిర్మించారని కొనియాడారు. ఇంజినీరింగ్ విద్యలో స్థిరత్వ ఎదుగుదల ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక సమాజంలో ఇంజినీరింగ్, సాంకేతికత కేంద్ర బిందువుగా మారిందని తెలియజేశారు. ఆర్థికంగా, పర్యావరణ పరంగా, సామాజికంగా స్థిరత్వాన్ని సాధించాలంటే ఇంజినీర్ పాత్ర ముఖ్యమైనదని తెలియజేశారు. మనం వివిధ రంగాలలో అభివృద్ధి చెందాలంటే అందుకు కావాల్సిన స్థిరత్వాన్ని అందిపుచ్చుకొని ఎదగాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రేపటి తరం యువ ఇంజినీర్లు దృష్టిలో పెట్టుకొని ఆ మార్గంలో పురోగతి సాధించాలన్నారు. డీన్ ప్రొఫెషనల్ బాడీస్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఇంజనీర్ తయారు చేసే యంత్రాలు స్థిరంగా, ఎక్కువకాలంగా మన్నికగా పనిచేసేటట్లు ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచం ఆర్థికంగా మరియు పరిశీలన పరంగా స్థిరమైన అభివృద్ధి చెందుటకు కావాల్సిన మార్గాలను విశదీకరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఐఇఐ కన్వీనర్ డాక్టర్ పి.వి.సంజీవకుమార్, పిఆర్‌ఒ డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, డీన్‌లు వివిధ విభాగాధిపతులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లి :** మిట్స్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఎ.అమరనాథ్‌రెడ్డి, విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయి ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.కమల్ బాషా, అడ్వైసర్ ఆర్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి దంపతులకు సన్మానం

సీనియర్ సిటిజన్స్‌కు పురస్కారాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్స్ వాణి మాసపత్రిక సంపాదకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో సుబ్బరాయ శాస్త్రి మెమోరియల్ ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, కవులు, రచయితలకు వార్షిక పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ ఆయన సతీమణి ఎం.ధనలక్ష్మిలకు మున్సిపల్ కమిషనర్, ఎడిటర్ సత్యనారాయణ, విజయవాడ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, రాధశ్రీ, గోపిచంద్ తదితరులు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎడిటర్ సత్యనారాయణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఎన్.మునిగోపాల కృష్ణ అందించిన సేవలకుగాను ఆయనను సన్మానించామన్నారు. ఎన్.మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సన్మానించిన ఎడిటర్ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

జడ్‌పి స్కూల్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం విశ్రాంత ఐజి ఇ.రాధాకృష్ణ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలోని సమావేశ మందిరంలో బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ప్రధాన కార్యదర్శి వి.మునివెంకటప్ప అధ్యక్షతన జరిగిన ఈసభకు రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ త్యాగం వల్ల ప్రయోజనం పొందుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు, ఆర్థికంగా స్థితిమంతులైన వాళ్ళు, పే బ్యాక్ టూ ద సొసైటీ అన్న అంబేద్కర్ ఆజ్ఞను అర్థం చేసుకొని, ఆయన మిషన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు తోడ్పాటును అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం వంటి విషయాలతో పాటు దళిత నాయకత్వ శిక్షణకు బ్రిడ్జ్ ఇండియా సొసైటీ పలు కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్ నరసింహులు, రాజేంద్ర, కె.వి.రమణ, ఎ.వి.రమణ, సుధాకర్, మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్, విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేంద్రబాబు, పోర్డు లలితమ్మ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయులు రెడ్డెన్న శెట్టి, దళిత సంఘాల నాయకులు చిన్నప్ప, చిట్టిబాబు, చెన్నకేశవులు, చందు, జయకుమార్, నారాయణ, కేవీ రత్నం పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐజి రాధాకృష్ణ



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న అధికారులు

హార్సిలీహిల్స్‌లో హైకోర్టు జడ్జి పర్యటన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ నందు ఏపీ హైకోర్టు జడ్జి కె.మన్మధరావు ఆదివారం పర్యటించారు.ఇందులో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు.పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందరేగా జడ్జి మాట్లాడుతూ ప్రస్తుతం హార్సిలీహిల్స్ ఎంతో అభివ ృద్ధి సాధించిందన్నారు.ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని,దేశంలోని ప్రముఖులందరూ తరచూ ఇక్కడికి వచ్చి అందాలను ఆస్వాదిస్తుంటారన్నారు.దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలలో హార్సిలీహిల్స్ ఒకటిగా ప్రసిద్ధిగాంచిందని,ఇక్కడ ఏర్పాట్లు అదు తేంగా ఉన్నాయని కితాబునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి.కొత్తకోట సిఐ రాజారెడ్డి,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సతీమణి

ప్రజాశక్తి-పీలేరు

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజా సమస్యలపై స్పందించారు. ఆదివారం ఆమె టిడిపి కార్యాలయంలో కూటమి కార్యకర్తలు, మహిళలతో సమావేశమయ్యారు. కాలనీల్లో తాగునీటి సమస్యలతో పాటు మహిళలకు పెన్షన్లు, ఇంటి స్థలాలు, ఇతర సమస్యలపై ప్రజల నుంచి విన్నపాలను స్వీకరించారు. తనూజ పలు సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని సమస్యలు పరిష్కార మార్గం చూపించి మరిన్ని సమస్యలకు అధికారుల ద ృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

- ఐసిడిఎస్ పీడీ శశికళ



ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుబాటులో ఉండి వారికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యం. జిల్లాలో ఐసిడిఎస్ కార్యాలయాల పనితీరు, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాం ఐసిడిఎస్ పీడీ శశికళతో ముఖాముఖీ..

ఐసిడిఎస్ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారి కార్యాలయం జిల్లా కేంద్రం రాయచోటిలో ఉంది. జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలు ఉన్నాయి. బి.కొత్తకోట, చిట్వేల్, లక్కిరెడ్డిపల్లి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, టి.సుండుపల్లి, తంబల్లపల్లి, వాల్మీకిపురం ప్రాంతాలలో ఉన్నాయి.

కేంద్రాల పనితీరు ఎలా ఉంది?

ఐసిడిఎస్ కార్యాలయాల పరిధిలో పనిచేసే అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 3 నుంచి 6 సంవత్సరముల పిల్లలకు అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్డు ఇస్తాం. మధ్యాహ్నం వరకు పిల్లలకు ప్రీస్కూలు యాక్టివిటీస్ చేయిస్తాం. మధ్యాహ్నం పైన 100 మిల్లీలీటర్ల పాలు ఇచ్చి ఆట పాటలు నేర్పిస్తాం.

జిల్లాలో అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతల వివరాలు చెప్పండి?

జిల్లా వ్యాప్తంగా మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 1828,మినీ అంగన్వాడీ కార్యకర్తలు 405, సహాయకురాళ్లు 1780, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 5,4023, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 4,1764, గర్భిణులు 9,957, బాలింతలు 9,712 మంది ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖాళీల వివరాలు తెలపండి?

జిల్లాలో మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 30, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 12, సహాయకురాళ్లు 78,(కోర్ట్ కేసులు, ప్రమోషన్‌లు, షిఫ్టింగ్‌తో సహా కలిపి) ఖాళీలు ఉన్నాయి.

ఐసిడిఎస్ అదనపు కార్యాలయాలకు ప్రతిపాదన పంపారా?

లేదు. అన్నమయ్య జిల్లాకు సరిపడా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలు ఉన్నాయి.

ఐసిడిఎస్ సొంత, అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు 2,275 ఉన్నాయి. సొంత భవనాలు 1,015, అద్దె భవనాలు 8,22, అద్దె లేని భవనాలు 438,(స్కూలు క్లాస్ రూములలో) ఉన్నాయి.

జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ఐసిడిసి భవనాలు ఎన్నున్నాయి?

జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాలు ఆరు ఉన్నాయి. వాటి మరమ్మతుల కోసం ఉన్నత అధికారులకు ప్రతిపాదనలను పంపాం.

బాల్య వివాహాలు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బాల్య వివాహాలను నివారించడానికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. అంగనవాడీ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరం కలిసి గ్రామాలలో పాఠశాలలో బాలికల హాస్టల్‌లో పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం.

గర్భిణులు, బాలింతలకు, తల్లిదండ్రులకు సలహాలేమైనా ఇస్తారా?

గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ ద్వారా అందించే పౌష్టికాహారం వారు మాత్రమే తినాలి. అప్పుడే వారికి సరైన పౌష్టికాహారం అందుతుంది. వారికి అందుబాటులో ఉన్న ఆకుకూరలు బాగా తినాలి. హెల్త్ చెక్ అప్‌లు తరచుగా చేపించుకోవాలి. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా కార్యక్తలు, మెడికల్ ఆఫీసర్లు సలహాలు, సూచనలు తప్పక పాటించాలి.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

వాల్మీకి మహర్షి జయంతిని సెలవుగా ప్రకటించాలి
సాధన సమితి జిల్లా అధ్యక్షులు నరసింహులు



వాల్మీకి జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అక్టోబర్ 17వ తేదీన జరగబోవు వాల్మీకి జయంతిని సెలవు దినంగా ప్రకటించి, వాల్మీకులను ఎస్టీలుగా చేయాలని వాల్మీకీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా అధ్యక్షులు పొదల నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ వాల్మీకులందరూ వాల్మీకి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ఎన్నికలకు వచ్చే ముందు అన్ని పార్టీల వారు వాగ్దానాలు చేస్తున్నారని, గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఇచ్చిన హామీని మరుగున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు నాయుడు వాల్మీకి జయంతి రోజున వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తున్నట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వాల్మీకులంతా రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీ హోదా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం వాల్మీకి జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్ మోహన్, రాష్ట్రీయ వాల్మీకి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు టేకుపల్లి శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటా రమణ, గౌరవ అధ్యక్షులు చిన్నం వెంకటరమణ, నరసింహులు, నిమ్మనపల్లి వాల్మీకి మండల నాయకులు చంద్రాయుడు, మహిళా అధ్యక్షురాలు గౌరమ్మ, మండల నాయకులు కమలాకర, మేకల శివ, యువజన విభాగం నాయకులు అంబులెన్స్ సూరి, మండల నాయకులు రాగి పిండి రమణ, జిల్లా నాయకులు చిన్నం శ్రీరాములు వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-రాయచోటి

సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మిలాద్ ఉన్ నబి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

సిఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం సెబ్‌ను రద్దుచేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంతో మదనపల్లెలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తూచా పాటించి వారి ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రాబడిని పెంచుతామన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ మరియు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉద్యోగస్తుల అభ్యర్థనను మన్నించి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేయడం గర్వంగా ఉందన్నారు. రెండింటిని విలీనం చేసిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్టేషన్ కార్యాలయ బోర్డును ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌గా మార్చి గోడకు ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మాతృశాఖకు ముందున్న సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తెచ్చేలా బాధ్యతగా, ఐకమత్యంగా, ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కోరారు.

జాకీర్ హుస్సేన్‌కు ఉత్తమ ఇంజినీర్ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంజినీర్ల మేధో సంపత్తికి దర్పణంగా రూపుదిద్దుకున్న నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలని, అలాంటి ఎన్నో నిర్మాణాలను జాతికి అందించి దేశంలో ఎన్నో ప్రాంతాలు సుభిక్షంగా తులతూగడానికి కారణమైన మహనీయుడు మోక్ష గుండం విశ్వేశ్వరయ్య అని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ కితాబిచ్చారు. ఇంజినీర్స్ డేని పురస్కరించుకొని ఆదివారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్శిటీ ప్రాంగణంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మదనపల్లె ప్రముఖ ఇంజినీర్ జిఎస్.జాకీర్ హుస్సేన్ బెస్ట్ స్ట్రక్చరల్ ఇన్నోవేటివ్ ఇంజినీర్ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న జాతీయ ఇంజినీర్ల దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయినన్నారు. ఈ నేపథ్యంలో మదనపల్లె పట్టణానికి చెందిన జాకీర్ హుస్సేన్ అందుకోవడం మదనపల్లెలోని పలువురు ఇంజినీర్లు, బిల్డింగ్ విభాగాలకు చెందిన ప్రముఖులకు గర్వకారణమన్నారు. సౌమ్యుడు, నిత్యకృషీవలుడు జాకీర్ హుస్సేన్ పనివిధానాన్ని గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఆయన అందిస్తున్న అమూల్యమైన సేవలు యువ ఇంజినీర్లకు ఆదర్శమన్నారు. జాకీర్ హుస్సేన్ నిబద్ధత, అకుంఠిత దీక్ష, మదనపల్లె ఇంజినీరింగ్ రంగంలోనే ప్రత్యేక గౌరవం సాధించిందని అభిప్రాయపడ్డారు. ఆయన అమలు చేసే విధానం పలువురు ఇంజినీర్లకు ఆదర్శంగా నిలుస్తుందని ఎస్.రెడ్డి సాహెబ్ కొనియాడారు. అవార్డు అందుకున్న జాకీర్ హుస్సేన్‌కు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

18న వాల్మీకిపురం మండల సమావేశం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెల 18వ తేది బుధవారం ఉదయం 10:30 గంటలకు వాల్మీకిపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మనోహర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశం నందు ఉపాధి హామి, వాటర్ షెడ్లు, త్రాగునీరు, గృహ నిర్మాణం, రెవెన్యూ, పౌర సరఫరాలు, వైద్య, విద్య, వ్యవసాయం, పశు సంవర్ధకశాఖ, విద్యుత్, మహిళా సమాఖ్య, జల వనరులు నీటి పారుదలశాఖకు సంబంధించిన అంశాలపై అధ్యక్షుల అనుమతితో అవసరమైన వాటిపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

66 ఏళ్ల తర్వాత మిత్రుల అపూర్వ సమ్మేళనం



గురువు వెంకటరమణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి-పీలేరు

వారంతా 80 ఏళ్లు దాటినవారే. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఎంత ఎత్తుకు ఎదిగినా చిన్ననాటి స్నేహితులను మరవలేదు. ఎన్నేళ్లయినా మిత్రులను కలవాలని వారిలో ముచ్చటించాలనే ఆశ తీరలేదు. 66 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాల వేదికగా పాత స్నేహితులను కలుసుకున్నారు. పీలేరు బోర్డు హైస్కూల్ (ప్రస్తుత ప్రభుత్వ ఉన్నత పాఠశాల) పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో 1958, 59, 60 ఎస్ఎస్ఎల్‌సి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వారు తమ గురువులు, తాము కోల్పోయిన తమ సహచరుల ఆత్మ శాంతి కోసం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ ఆధ్య ప్రధానోపాధ్యాయులు దివంగత నారే వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. 2022 ఏప్రిల్ 22న వీరు 35 మంది మిత్రులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సమావేశమై తమలో విజ్ఞాన దీపాన్ని వెలిగించిన విద్యాలయం అభివృద్ధికి అందరూ రూ.4.50 లక్షలు ఖర్చు చేసి ఆఫీస్ ఫర్నిచర్, సోలార్ లైట్, జిరాక్స్ మిషన్, కంప్యూటర్ ప్రింటర్ అందజేశారు. వీరు రెండోసారి 30 మందితో తిరుపతి రాయ్ వైస్రాయ్ హోటల్లో 2023 మార్చి 12న సమావేశమయ్యారు. తిరిగి ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మూడవ సమావేశానికి 12 మంది మిత్రులు మాత్రమే హాజర య్యారు. మిగిలినవారు వయస్సు, ఆరోగ్యం సహకరించక సమావేశానికి హాజరు కాలేకపోయారు. కార్యక్రమంలో పీలేరు విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎ.రెడ్డి సుబ్రహ్మణ్యం, విశ్రాంత అధ్యాపకులు టి.రాఘవరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యా యులు డి.నారాయణ, పారిశ్రామికవేత్త ఎం.బలరామకృష్ణ, విశ్రాంత కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగి రాజారెడ్డి, మీసాల రాజారెడ్డి, పిసి రెడ్డెప్ప శెట్టి, పి.రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ పిఆర్ రెడ్డప్ప రెడ్డి, పి.వెంకటస్వామిరెడ్డి పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ నీలకంఠేశ్వరరావు

రాష్ట్ర స్థాయి క్రీడలకు 'ఆదర్శ' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-19 చెస్ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబ రిచారని అన్నారు. నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు ఎస్.సంతోష్‌రెడ్డి, ఎం.జగదీష్, ఎం.వర్షిత్ కుమార్‌రెడ్డి, పదవ తరగతి, స్టాండ్ పైగా ఎన్.తేజేశ్వర్‌రెడ్డి ప్రతిభ చూపారని అన్నారు. క్యారమ్స్‌లో ఎన్.తేజే శ్వర్‌రెడ్డి అత్యధిక ప్రతిభ కనబరిచాడని అన్నారు. వీరు నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థు లను ప్రిన్సిపల్ లీలాశ్రీహరి అభి నందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభ కనబ రిచి పాఠ శాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా టిటిడి ఆధ్వర్యంలో జరిగిన వెంకన్న పవిత్రోత్సవాలు ఆది వారంతో ముగిసాయి. ఆదివారం ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టర్, ఆలయ అర్చకులు రమేష్ ఆచార్యులు ఆగమ శాస్త్రం మేరకు సాంప్ర దాయబద్ధంగా స్వామివారికి ఈ పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. చతుర్థానార్చన, స్నపన తిరుమంజనం, పవిత్ర విసర్జన, చతుర్థానార్చనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి చక్ర స్నాన కార్యక్రమం భక్తులను కనువిందు చేసింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం నీది ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.


బాధితుడికి ట్రైసైకిల్ అందిస్తున్న యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు

గాయపడిన వ్యక్తికి చేయూత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ, బండమీదపల్లెకు చెందిన బాణాల కదిరిప్ప గత ఏడాది ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు.సర్జరీ అయిన తర్వాత అతని వెన్నెముక పనిచేయలేని పరిస్థితిలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషనును ఆశ్రయించగా ఫౌండేషన్ తరుపున ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో తమ సంస్థ అందరికి అండగా ఉంటుందని అన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని స్పూర్తిగా తీసుకొని ముందుకు సాగుతు న్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజశేఖర్, శివారెడ్డి, చందు, విశ్వనాథ్, శ్రీనివాసులు, మురళి,చిన్ని, అనిల్, చంద్ర, తుమ్మరకుంట గ్రామప్రజలు ఆనంద్ రెడ్డి, రాజేష్ జాఫర్వల్లి, నారాయణప్ప, రామాంజి పాల్గొన్నారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శాఖాహారం తీసుకుంటూ, ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లబిస్తుందని సదానందగిరి స్వామీజీ తెలిపారు. ఆదివారం మదనపల్లెలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానం, శాఖాహార అవగాహన ప్రచార ర్యాలీ నిర్వహించారు. నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి కల్యాణ మండపం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, బెంగళూరు బస్టాండు, టౌన్ బ్యాంక్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, మాయా బజార్ల మీదుగా తిరిగి చౌడేశ్వరి కళ్యాణ మండపం వరకు దాదాపు 4 వేల మంది శాఖాహారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిరమిడ్ స్పిచ్యువల్ మూమెంట్స్ వరల్డ్ గవర్నింగ్ ట్రస్ట్ మాజీ ట్రస్ట్, ట్రెజరర్ డాక్టర్ ఎవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన చౌడేశ్వరి కల్యాణ మండపంలో అవగాహన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి అనేకమంది పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన పిరమిడ్ లీడర్లు శాఖాహారం, ధ్యానం చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ కృష్ణప్ప, చలపతి, తిరుపతి కంచి రఘురాం, హైదరాబాద్ పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, రాయచోటి సతీష్ పాల్గొన్నారు.

కెసి పరిధిలో ముమ్మరంగా వరినాట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కెసి కాలువ నీటి ద్వారా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రామదాసు పురం, రాజువారిపేట, తిప్పిరెడ్డిపల్లె, కుందూనది తీర గ్రామాలలో కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, సీతారామాపురం, చాపాడు గ్రామాల పరిధిలో వరి పంటను రైతులు సాగు చేశారు. జులై మొదటి వారం నుంచి వరినార్లు సాగు చేపట్టారు. ఆగస్టు మొదటి నుంచి వరి నాట్లు వేశారు. కెసి కాలువ పరిధిలోని సిద్దారెడ్డిపల్లె, విశ్వనాథాపురం, సోమాపురం, బద్రిపల్లె, కేతవరం తదితర గ్రామాల్లో ఆగస్టు మొదటి వారంలో వరి నార్లు సాగు చేపట్టి, ఈనెలలో వరినాట్లు వేశారు. ప్రస్తుతం అక్కడక్కడా వరినాట్లు సాగు చేపడుతున్నారు. 13వేల ఎకరాల వరకు వరి పంట సాగైంది. కొంత మంది రైతులు మొదటి ధపా సతువలు కూడా చల్లుతున్నారు. కెసి కాలువకు త్వరగా నీరు విడుదల కావడంతో 13వేల ఎకరాలలో వరి పంట సాగు అయ్యే అవకాశం ఏర్పడింది. గత ఏడాది సరైన వర్షాలు లేక కెసి కాలువకు నీరు విడుదల కాకపోవడంతో ఆరుతడి పంటలకే పరిమితం కావాల్సి వచ్చింది. కుందూ, పెన్నా పరిధిలో కేవలం 3వేల ఎకరాల మాత్రమే వరి పంట సాగైంది. మిగిలిన రైతులు జొన్న, మొక్కజొన్న, మినిము వంటి పంటలకు పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం బెంగాల్, బీహార్ వంటి ప్రాంతాల నుంచి వలస కూలీలు రావడంతో వరి నాట్లు త్వరగా పూర్తయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

'ఏచూరి' మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఏచూరి మరణం వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు విపి బయన్న మాట్లాడుతూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 23 రోజులుగా చికిత్స తీసుకుంటూ మృతిచెందారని చెప్పారు. ఆయన మరణానికి ఎర్రగుంట్ల మండల అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఘన నివాళులు లాల్ సలాంతో సెల్యూట్ తెలుపుతుందన్నారు. దేశంలో కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్న ప్రభుత్వాల విధానాలను ఎప్పటికప్పుడూ చట్టసభల్లో, బయట ఆయన గొంతు వినిపిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. మార్క్సిస్ట్ మేధావిగా గుర్తింపు పొందారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అన్వేష్, సిపిఐ నాయకులు ఓబుల్‌రెడ్డి, రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, ఓబయ్య, ఆర్‌టిపిపి కార్మిక నాయకులు, వెన్నపూస సుబ్బిరెడ్డి, టీచర్ సాంబశివుడు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

పచ్చదనం, పరిశుభ్రతే తమ ధ్యేయమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఓబుల వారిపల్లి మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వారు పర్యటించారు. మురికి కాలువలను పరిశీలించి, ప్రజలు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే మురికి కాలువలను, చెత్త దిబ్బలను తొలగింపజేస్తామని చెప్పారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడుతామని అన్నారు. ప్రతి పంచాయతీలో పచ్చదనాన్ని పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల వ్యాప్తికి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యకరంగా జీవించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్, తాగునీరు సమస్యలు లేకుండా చేస్తామని, పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని ప్రజలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

వైభవంగా వినాయక నిమజ్జనం


గణేశుడిని నిమజ్జనానికి ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని పాతతేరువీధిలో ఏర్పాటు చేసిన గణేశుడిని ఆదివారం నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో గణేశుడిని ఊరేగించి, యువత కేరింతలు కొడుతూ కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. మండలంలోని అయ్యవారిపల్లిలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాట రూ.1,50,027లు పలికింది. లడ్డూను ఇదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి కుటుంబం వేలం పాటలో దక్కించుకుంది. **సుండుపల్లి :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 9వ రోజు మండలంలోని బైనేని వారిపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆదివారం టిడిపి నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఆయనకు వినాయకుని విగ్రహ కమిటీ కాలవపల్లి కిషోర్, కాలవపల్లి నాగేశ్వరరావు స్వాగతం పలికారు. గ్రామస్తులు అందరితో కలిసి మర్యాదపూర్వంగా పలకరిం చారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాయవరం సర్పంచ్ రఫిక్, చంద్రమోహన్, మడితాడు శేఖర్ రెడ్డి, రాజంపేట తెలుగు యువత పట్టణ అధ్య క్షులు రాము యాదవ్, మండెం నాగరాజు, ఇరువురి మురళి, స్థానిక నాయకులు ప్రజలు బైనేని వారి పల్లి యువత పాల్గొన్నారు.

రూ.67 వేలు పలికిన గొల్లపల్లి లడ్డూ

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలిసినటువంటి వినాయక స్వామి లడ్డూ వేలం పాటలో మాసపల్లి హరి ప్రసాద్ రూ.67వేలకు పాడి లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.


వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న మాసపల్లి హరిప్రసాద్

తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి మండలం చాలా వెనుకబడిన మండలమని, ఇక్కడ గత ప్రభుత్వాలు ఎలాంటి అభివృద్ధి చేయలేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు సౌకర్యవంతంగా రోడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోమవారం టిడిపి కార్యాలయం ప్రారంభానికి వస్తున్న మంత్రి వస్తున్న సందర్భంగా లక్కిరెడ్డి పల్లెలో మొట్టమొదటిసారిగా పదివేల మంది కార్యకర్తలతో భారీ బహిరంగను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని మూడు కోట్ల రూపాయలతో తొందరలో తాగునీరు సమస్యలు మంత్రి పరిష్కరిస్తారని తెలిపారు. డిసెంబర్ నెలలోపు ప్రతి పల్లె రోడ్డు ఏర్పాటు చేయిస్తామని, లక్కిరెడ్డిపల్లె ఆర్‌టిసి బస్టాండుకు బస్సులు వచ్చేటట్లు డిఎంతో మాట్లాడమని అన్నారు. మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్ర మంలో మాజీ ఎంపిటిసి యనమల మదన్మోహన్, డాక్టర్ షఫీనాయక్, కావలి ఆంజ నేయులు, గురుస్వామి, వెంకటేశ్వర్లు, జంగారెడ్డి, జైచంద్రారెడ్డి, జనార్ధన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు వస్తుందని స్నేహిత అమృత సేవా సంస్థ అధ్యక్షులు రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతాకు పెద్దక్క మరణించడంతో ఆమె కుమారులు రామాంజనేయులు, ప్రభాకర్, కుమార్తె మరియమ్మ, కోడళ్ళు పుష్పావతి, భార్గవి, అల్లుడు ప్రసాద్ నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ,అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలు గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియా లను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణం తరువాత కూడా జీవించాలంటే, ఈ ప్రపంచాన్ని మళ్ళీ చూడాలని ఉంటే నేత్రదానం తోనే సాధ్యమని చెప్పారు. కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన తరువాత నేత్రదానం చేయదలచుకున్న వారు 9966509364,7093204537లలో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను నల్లపురెడ్డిపల్లి గ్రామ నాయకులు, వైసిపి మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

వైద్య విద్యా విధానానికి తూట్లు : 'రాచమల్లు'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిని నిర్వహించే శక్తి తమ ప్రభుత్వానికి లేదని, రద్దు చేయాలని లేఖ రాసి వైద్య విద్యావిధానానికి తూట్లు పొడుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి వాపోయారు. స్థానిక వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత రద్దు చేయమని కోరుతూ చంద్రబాబు రాసిన లేఖను సమావేశంలో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొట్టతొలుత 1923లో విశాఖపట్నంలో ఆంధ్రమెడికల్ కళాశాల ఏర్పాటు అయిందని అప్పటి నుండి జగన్ పాలనకు ముందు వరకు 37 మెడికల్ కళాశాలలు ఏరాటయ్యాయని పేర్కొన్నారు. ఒక్క జగన్ హయాంలోనే 17మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో 5 కళాశాలల్లో 750 సీట్లతో నడుస్తున్నాయన్నారు. మిగిలిన 12 కళాశాలల ద్వారా బాబు పుణ్యమా అని 1800 సీట్లు కోల్పోతున్నామన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు, ఆయన మనవడు దేవాంశ్‌కు రాష్ట్ర ప్రజలు మంచి భవిష్యత్తునిస్తే ఇక్కడి బిడ్డల భవిష్యత్తును వారు అంధకారం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రయివేట్ పరమైతే తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. జగన్ హయాంలో వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్‌ఇ సిలబస్ ప్రవేశపెటితే ఆ విద్యావిధానాన్ని బాబు రద్దు చేశారన్నారు. విద్యావిధానంలో తెలంగాణ ప్రభుత్వం దూసుకుపోతుంటే మనం వెనకబడిపోతున్నామని వాపోయారు. పోరాటంలో ప్రజలు మద్దతివ్వాలని రాచమల్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి,కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే

ప్రజాశక్తి - వేంపల్లె

జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తలిశెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1985-86 విద్య సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థిలైన షకీలా, రాజేశ్వరి, నాగవల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అందరూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులు తమ పట్ల చూపిన అభిమానానికి పూర్వ విద్యార్థులు నమస్కార వందనంతో గౌరవించారు. ఆనాటి విద్యార్థులకు చదువు చెప్పిన గురువులైన మంగమ్మ, సరస్వతమ్మ, శకుంతలమ్మ, సరోజమ్మకు దుస్తులు సమర్పించి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ జీవితంలో స్నేహ బంధం అంత మధురమైందని చెప్పారు. స్నేహితులతో పంచుకున్న జ్ఞాపకాలను, గడిపిన మధురమైన క్షణాలను 38 ఏళ్ల తర్వాత మళ్ళీ ఒక్కసారి తలుచుకుని జీవితాలను సుసంపన్నం చేసుకునేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం సంతోషకరమని చెప్పారు. వివిధ రంగాలలో తమ స్నేహితులు మంచి హోదాలో ఉండడం, కొందరు స్వయం ఉపాధిలో, మరికొందరు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లో ఉండడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థినులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని సరదాగా గడిపి అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు సరళ, సరస్వతి, పద్మా, షకీల భాను, సుశీల, షాకీరా, శ్రీదేవి, రెడ్డెమ్మ, సుజాత, యల్లమ్మ, పద్మజ, గురుదేవి, వాసవి, రమాదేవి, సిద్దేశ్వరి, జయలక్ష్మి, లక్ష్మీదేవి, సరళ, సాయిలక్ష్మి, రమా నిరంజనమ్మ, ధనలక్ష్మి, అన్నపూర్ణ, గీతావాణి, ఆశ్రిఫున్ పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు ప్రసిద్ధి 'జీనోమిక్స్ బయోటెక్'

- సిఇఒ రత్నగిరి పొలవరపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



అవార్డును అందుకుంటున్న శాస్త్రవేత్త డాక్టర్ వినయ్ చంద్

ఆరోగ్య సంరక్షణ మెరుగుదల కోసం వినూత్న ఆవిష్కరణలను తమ జినోమిక్స్ బయోటెక్ ద్వారా అందిస్తున్నామని జెనోమిక్స్ ప్రెసిడెంట్, సిఇఒ రత్నగిరి పొలవరపు తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తాము ఐవిఆర్‌ఐతో కలిసి కోళ్ల వ్యాధులపై చేసిన పరిశోధనలకు గాను బిఐఆర్ఎసి డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ భారత ప్రభుత్వ ఇన్నోవేటర్ అవార్డును అందజేసిందని తెలిపారు. ఈ అవార్డును డిబిటిసి సెక్రెటరీ రాజేష్ సుధీర్ గోఖలే చేతుల మీదుగా అందుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో తమ జీనోమిక్స్ బయోటెక్ ద్వారా మరిన్ని పరిశోధనలు చేస్తామన్నారు. 2003లో జీనోమిక్స్ బయోటెక్ అత్యాధునిక పరిశోధన కేంద్రాన్ని స్థాపించామన్నారు. నాటి నుంచి తాము జీనోమిక్స్ మాలిక్యులర్ డయాగ్నొస్టిక్ ప్రయివేట్ లిమిటెడ్, జీనోమిక్స్ హెల్త్ కేర్ ఆఫ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, జెనోమిక్స్ కార్ల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటివి ప్రభుత్వ, ప్రయివేట్ సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం ద్వారా పులివెందులలో జీనోమిక్స్‌కార్ల్ ప్రయివేట్ లిమిటెడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. తమ పరిశోధన కేంద్రం మానవ ఆరోగ్య అవసరాలకు సంబంధిత వ్యాధిని గుర్తించే కిట్లను కూడా అందిస్తోందన్నారు. మరి ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవి, హెచ్‌సివిలతోపాటు జంతువుల ఆరోగ్య అవసరాలకు సంబంధించిన బ్రూస్ సెల్లో సిస్, టిబి, ఫుట్ అండ్ మౌత్ డిసీస్ వంటి వ్యాధి నిర్ధారణ కిట్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 2018లో ఎన్ఆర్‌సిఇ వారి సహకారంతో దేశంలోనే ఏకైక గ్లాండర్స్ వ్యాధి నిర్ధారణ కిట్‌ను కనుక్కున్నారని చెప్పారు. కరోనా సమయంలో కూడా వ్యాధి నిర్ధారించడానికి కావాల్సిన కిట్లను అభివృద్ధి చేసి కర్నూల్లో ల్యాబ్ ఏర్పాటు చేసి అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించామని చెప్పారు. మా జీనోమిక్స్ బయోటెక్ పరిశోధన కేంద్రం ఆధునిక పశువుల పరిశోధన మరియు జంతువుల ఆరోగ్యం, ఉత్పాదకతను మెరుగుపరచడానికి పరిష్కారాలపై దృష్టి పెడుతుందని తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన జనాభాకుత పరిశోధన కేంద్రం మద్దతు ఇస్తుందన్నారు. భవిష్యత్తులో జీనోమిక్స్ బయోటిక్ పరిశోధన కేంద్రం ద్వారా ప్రజా పరిరక్షణకు దోహదపడతామని తెలిపారు. సందర్భంగా అవార్డును అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


రూపానందరెడ్డికి చెక్కు అందిస్తున్న శివ గణేష్ ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యం

వరద బాధితులకు రూ.51,116 సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గోవిందంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పొలం నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ఈశ్వర్‌రాజుకి చెందిన శివ గణేష్ ట్రాన్స్ పోర్ట్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు రూ.51,116లు ఆర్థిక చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డికి చెక్కును అందించారు.ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ విజయ వాడలో వరదలకు సర్వం కోల్పోయిన వారికి మానవతా దృక్పథంతో సాయం అందించడం అభి నందనీయని అన్నారు. మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసిలను ఆయన ప్రత్యేకంగా అభి నందిం చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామాపురం

మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం అరవింద్ ఐ హాస్పిటల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్ష శిబిరానికి విశేషస్పందన లభించిందని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఎస్.హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని తిరుపతి అరవింద్ ఐ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్యాంపు నిర్వహకులు లయన్ అంజన్‌రెడ్డి, డాక్టర్ లయన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో పేద ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు క్యాంపు నిర్వహించి 40 మందికి కంటి పరీక్షలకు ఎంపిక చేసి ఆపరేషన్లు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఉచిత మెగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఆస్పత్రి పిఆర్‌ఒ శంకర్, నూకల రవీంద్ర మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు మాకు చాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. నియోజకవర్గం మొత్తం కంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ ఆమని, డాక్టర్ భవాని పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి నట్లు తెలిపారు.వైద్యశిబిరంలో లయన్ వెంకటరామిరెడ్డి, మండల టిడిపి నాయకులు ప్రతాప్‌రెడ్డి, గడికోట భాస్కర్‌రెడ్డి, సురం శివారెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, శంకర్ ,ఎస్.శివారెడ్డి గంగిరెడ్డి మదన, వెంకటేష్, కృష్ణ మూర్తి, రామ్మోహన్, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు అన్యాయం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా 2024- 25 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 700 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు కాలేదని, దీంతో పేద విద్యార్థులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి మండిపడ్డారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పులివెందుల, పాడేరు మెడికల్ కళాశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఉంటే ఒక్కొక్క కళాశాలకు 150 ఎంబిబిఎస్ సీట్లు చొప్పున 750 సీట్లు వచ్చి ఉండేవని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించని కారణంగా జాతీయ మెడికల్ కమిషన్ ఒక్క పాడేరు మెడికల్ కళాశాలకు మాత్రం 50 సీట్లు కేటాయించిందని చెప్పారు. పాడేరు మెడికల్ కళాశాలకు 50 శాతం నిధులు కేంద్రం భరిస్తుంది కాబట్టి ఆ మేరకైనా 50 సీట్లు వచ్చాయని చెప్పారు. పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం వైఖరి గర్హనీయమని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి 50 సీట్లు కేటాయిస్తూ ఈ ఏడాది ఆగస్టు 16న జాతీయ మెడికల్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి పత్రం ఇచ్చిందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ మెడికల్ కళాశాలను నిర్వహించలేమని చంద్రబాబు ప్రభుత్వం ఈనెల 10న ఎన్ఎంసికి లేఖ రాసిందని తెలిపారు. దీంతో 2024 సెప్టెంబర్ 11న ఎన్ఎంసి అనుమతి పత్రాన్ని ఉపసంహరించుకుందని చెప్పారు. దేవుడు వరమిస్తే పూజారి అడ్డుకున్నట్లుంది చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకం అన్నారు. ఏ ప్రభుత్వం ఇలా చేయదని కూటమి ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ అసమర్థతకు ఇది పరాకాష్ట అన్నారు. పులివెందులపై, కడప జిల్లాపై కక్ష కట్టడం శోచనీయం అన్నారు. వెంటనే అండర్ టేకింగ్ లేఖ ఎన్ఎంసికి ఇచ్చి 50 సీట్లతో ఈ విద్యా సంవత్సరం లోనే పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వేముల

స్థానిక కడప-పులివెందుల ప్రధాన రహదారి గొందిపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలను, కార్లను ఆపి తనిఖీలు చేపట్టారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని, పరిమితికి మించిన వేగంతో వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నూర్, మస్తాన్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లి మండలంలో జరిగింది. బాధితురాలు తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని సిటిఎం గంగాపురానికి చెందిన వెంకటరమణ కుమార్తె సి అరుణ (25), ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గమనించారని తెలిపారు. ఏమి ఆలోచించారో ఏమో ఒక్క ఉదుటున ఇంట్లోకి చొరబడి ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టి పరారయ్యారు. అపస్మారక స్థితిలో పడి మహిళను గుర్తించిన స్థానికులు మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కళా వెంకట్రమణ తెలిపారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మాయాబజార్‌లో కత్తిపోట్లకు గురైన చేనేత కార్మికుడు ఆదివారం మృతి చెందాడు. ప్రత్యర్థి కత్తితో పొడవడంతో పేగులు బయటకు వచ్చి నాలుగు నెలల పాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడాడు. చివరకు ఆదివారం తనువు చాలించాడు. చేనేత కార్మికుడు మృతితో దేవలచెరువులో విషాదం అలుముకుంది. ఘటనపై మదనపల్లి రెండవ పట్టణ సిఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం నీరు గట్టువారిపల్లి, మాయాబజారులోని టిడిపి నేత ఇంట్లో మొలకలచెరువు మండలం దేవలచెరువుకు చెందిన సాంబశివ(30) కూలీ మగ్గాలు నేసుకుంటూ జీవనం చేసేవాడని తెలిపారు. ఆ సమయంలో స్థానికంగా ఉండే అల్తాఫ్ తన చెల్లెలితో సాంబశివ అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కక్ష్య పెంచుకున్నాడని తెలిపారు. మే 3న సాంబశివను అల్తాఫ్ కత్తితో పొడిచి చంపేందుకు ప్రయత్నించాడని తెలిపారు. ఈ ఘటనలో సాంబశివ అపస్మారక స్థితికి చేరుకుని కుప్పకూలాడని తెలిపారు. బెంగళూరులో నాలుగు నెలల పాటు చికిత్స తీసుకుంటూ మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.